ప్రజలు అప్రమత్తంగా ఉండాలి


నాలా పరివాహక ప్రాంతాన్ని పరిశీలించి అధికారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్

మోతీనగర్: నాలా పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కార్పొరేటర్ సబిహాబేగం, అడిషనల్ కమిషనర్ శివకుమార్‌నాయుడు అన్నారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి సున్నం చెరువు దిగువగా ప్రవహిస్తున్న నాలా పరివాహక ప్రాంతాలైన సర్దార్‌నగర్, రాజీవ్‌గాంధీ నగర్‌లో నాలా నీటి మట్టాన్ని శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. అధికారులు ఎప్పటికప్పుడూ సహాయక చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఏఈ లక్ష్మీనారాయణ, మేడ్చల్ జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు మహ్మద్ గౌసుద్దీన్, సయ్యద్ రియాజ్, కొండయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత తప్పనిసరి

ఆల్విన్‌కాలనీ: అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని, నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని కార్పొరేటర్ దొడ్ల వెంకటేశ్‌గౌడ్ అన్నారు. ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని నవోదయా కాలనీలో రూ. 20 లక్షల నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను శనివారం పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రోడ్డుపై నీరు నిల్వకుండా ముందస్తు ప్రణాళికతో నిర్మాణ పనులు పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో శివరాజ్‌గౌడ్, షౌకత్ అలీ మున్నా, యాదగిరి, సయ్యద్, రాజిరెడ్డి, శివశంకర్‌రావు, మధన్, కిషోర్ రెడ్డి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.


పనుల పరిశీలనలో పాల్గొన్న కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్ తదితరులు


వేతనాలు ఇప్పించాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుకు వినతిపత్రం అందజేస్తున్న పొదుపు మహిళా సమాఖ్య ప్రతినిధులు -కూకట్‌పల్లి

ఆలయంలో అన్నదానం


అన్నదానంలో పాల్గొన్న భక్తులు

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ ఫేజ్ 2 లోని భ్రమరాంబా మల్లికార్జున స్వామి ఆలయంలో ఆషాఢ మాసోత్సవంలో భాగంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. శాకంబరి అమ్మవారిగా అలంకరించిన కూరగాయలతో శనివారం మహా ప్రసాదాన్ని తయారు చేసి భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో శ్యామల భాస్కర్‌రెడ్డి, సమ్మారెడ్డి, యాదవరెడ్డి, శ్రీను, ఆలయ ప్రధాన అర్చకులు అఖిలేశ్వర శర్మ పాల్గొన్నారు.

పంచశీల పాఠశాలలో గురు పౌర్ణమి

మూసాపేట: మూసాపేటలోని పంచశీల ఉన్నత పాఠశాలలో శనివారం గురుపౌర్ణమి వేడుకలను నిర్వహించారు. వ్యాసమహర్షి జన్మదినం సందర్భంగా విద్యార్థులచే ప్రత్యేక పూజలు నిర్వహించారు. విద్యార్థులకు గురువుల ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో పాఠశాల అధినేత డి. శ్రీనివాసులు, హెచ్‌ఎం డి. అనిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


గురు పౌర్ణమి వేడుకలో పాల్గొన్న విద్యార్థులు

అలరించిన ఆంధ్రనాట్యం

మాదాపూర్: కళాకారులు సంకీర్తనలతో, ఆంధ్రనాట్యంతో సందర్శకులను అలరించారు. మాదాపూర్‌లోని అన్నమయ్యపురంలో శనివారం గురుపూర్ణిమ వేడుకలను నిర్వహించారు. అన్నమాచార్య భావన వాహిని శిష్యబృందం ధన్యోస్మి, పద్మశ్రీ, అక్షయ, అశ్రిత, పూర్విజ్, నారాయణి, మారుతి, విజయలక్ష్మి, శశికళ, అంబిక, సాయి అన్వితరెడ్డిలు సంకీర్తలను ఆలపించారు కీబోర్డు రాజు, తబలాపై నోవా వాయిద్య సహకారాన్ని అందించారు. శ్రీభాస్కర్ డ్యాన్స్ అకాడమీ గురువు సాత్విక శిష్యబృందం లక్ష్మీప్రణతి, శ్రీహిత, ధనిష్క, జాహ్నవి, హాసిని, శరణ్య, తనుశ్రీ, నవ్య, షన్విక సంయుక్తంగా శివోహం, గురుఅష్టకం, దశావతారం, శబ్దం (ఆంధ్రనాట్యం) కీర్తనలకు నృత్యరూపకంతో అలరించారు. అనంతరం డాక్టర్ శోభరాజు తమ సందేశాన్ని అందించారు. సత్సంకల్ప ఫౌండేషన్ వ్యవస్థాపకులు శ్రీధర్ తాళ్ళపాక ముఖ్య అతిథిగా పాల్గొని కళాకారులకు జ్ఞాపికలను అందజేశారు.



కేసుల విషయంపై నిర్లక్ష్యం తగదు

డీసీపీ కోటిరెడ్డి

కుత్బుల్లాపూర్: కోర్టు పరిధిలో ఉన్న పోలీస్ కేసుల విషయంపై నిర్లక్ష్యం తగదని, ప్రతి కేసు విషయంపై సీఐలు అప్రమత్తంగా ఉండాలని మేడ్చల్ డీసీపీ కోటి రెడ్డి అన్నారు. పేట్ బషీరాబాద్ ఏసీపీ కార్యాలయంలో శనివారం అల్వాల్, శామీర్‌పేట్, జీనోమ్ వ్యాలీ, మేడ్చల్ ,సూరారం, దుండిగల్ సిఐలతో పాటు కోర్టు వ్యవహారాలు చూసే సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. డివిజన్ పరిధిలో ఉన్న సుమారు రెండు వేలకు పైగా కేసుల విషయంపై ఆరా తీశారు. ఎప్పటిక ప్పుడు వారెంట్లను జారీ చేస్తూ సీఐలను అప్రమత్తం చేయాలని దొంగతనం చేసి జైలు నుంచి విడుదలైన దొంగలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలన్నారు. కోర్టు కేసుల విషయంలో ఎవరూ అశ్రద్ధ వహించొద్దని తెలిపారు. ఈ సమావేశంలో అడిషనల్ డీసీపీ నరసింహారెడ్డి, ఏసీపీలు రాములు, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మేడ్చల్ డీసీపీ

గత ప్రభుత్వాల తప్పిదాలతోనే అభివృద్ధి శూన్యం

సుభాష్‌నగర్: హైదరాబాద్ నగరానికి పట్టుకొమ్మగా ఉన్న మేడ్చల్ అర్బన్ జిల్లా గత ప్రభుత్వాల తప్పిదాలతో అభివృద్ధిలో ముందుకు సాగలేదని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ ఆరోపించారు. శనివా రం గాజులరామారంలో జరిగిన బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరైన మాట్లాడారు. మేడ్చల్ అర్బన్ జిల్లా పరిధిలో ఇండస్ట్రియల్ కారిడార్లు, కాలేజీలు, యూనివర్సిటీలు ఉన్నా తగిన సదుపాయాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, హైదరాబాద్ మెట్రోరైలు ఈ ప్రాంతానికి విస్తరిస్తే మరింత అభివృద్ధి సాధ్య పడుతుందన్నారు. ఇప్పటికే ఉన్న ఎంఎంటీఎస్ సర్వీసులు ఇంకా పెంచాల్సి ఉందని, ఫ్లై ఓవర్లు, రోడ్లను విస్తరించాల్సి ఉందని, వీటన్నింటిపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించి జిల్లా అభివృద్ధికి సహకరించాలన్నారు.

 
ఆల్విన్‌కాలనీలోని పరికి చెరువు నాలా పక్కన ఏపుగా పెరిగిన కలుపు మొక్కలు

పాములు వచ్చినా పట్టించుకోరా?



- నాలా పరివాహక ప్రాంతంలో ఏపుగా చెట్ల పొదలు
- విష సర్పాలకు ఆవాస కేంద్రాలుగా మారిన వైనం
- భయం గుప్పిట్లో కాలనీల ప్రజలు

ఆల్విన్‌కాలనీ: కాలనీలలోకి విష సర్పాలు ,పురుగులు వస్తుండటంతో ప్రజలు భయం భయంగా జీవిస్తున్నారు. కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని ఆల్విన్‌కాలనీ, ధరణినగర్, తులసినగర్, షిరిడీ నగర్‌లో పాములు, తేళ్లు , విష కీటకాలతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని కాలనీల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆల్విన్ కాలనీలో ఉన్న పరికి చెరువు నాలా వెంబడి చెట్ల పొదల నుంచి కాలనీలోకి పాములు వస్తున్నాయి. చెరువు కట్టపై దట్టమైన పొదలు విష సర్పాలకు ఆవాసంగా మారాయని కాలనీ వాసులు తెలిపారు. నాలాలో ఎలుకలు పెట్టిన సొరంగాలలో సర్పాలు చేరడంతో రాత్రి అయితే చాలు బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. నాలాలో పేరుకు పోయిన చెత్తా చెదారాన్ని తొలగించటానికి జీహెచ్‌ఎంసీ అధికారులు జేసీబీల ద్వారా చెత్తను గట్టుపైకి చేర్చాల్సి ఉంటుంది. కొన్ని ప్రదేశాల్లో మాత్రమే చెత్తను తరలించారు. అధికారుల పర్యవేక్షణ లోపం వల్ల సమస్య ఉన్న ప్రాంతంలో సంబంధిత జేసీబీ కాంట్రాక్టర్లు చెత్తను తొలగించకపోవటంతోనే కలుపు మొక్కలు ఏపుగా పెరిగి విష సర్పాలకు ఆవాసంగా మారిందని కాలనీల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


వీధి లైట్లు వెలగకపోవడంతో చీకటిగా ఉన్న చెరువు నాలా ప్రాంతం

వీధి దీపాలు వెలగక చిమ్మచీకటి

నాలా చుట్టూ వీధి దీపాలు వెలగకపోడంతో ఆ ప్రాంతమంతా చీకటిగా ఉంటుంది. విషసర్పాల భయంతో అక్కడి నుంచి రాకపోకలు సాగించాలంటేనే ప్రజలు భయపడుతున్నారు. ఇప్పటికైనా నాలాకు ఇరువైపులా దట్టంగా పెరిగిన చెట్ల పొదలను తొలగించాలని, వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

క్యారమ్స్ పోటీలు ప్రారంభం


కార్యక్రమంలో మాట్లాడుతున్న కార్పొరేటర్

కేపీహెచ్‌బీకాలనీ: కేపీహెచ్‌బీ డివిజన్ 3వ ఫేజ్‌లోని సీనియర్ సిటిజన్ భవనంలో మేడ్చల్ మల్కాజిగిరి క్యారమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్యారమ్స్ పోటీలు రెండు రోజులు జరగనున్నాయి. పోటీలను కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ప్రతినిధులు, క్యారమ్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

నకిలీ బంగారం విక్రయించేందుకు యత్నం

జీడిమెట్ల: తక్కువ ధరకే బంగారం విక్రయిస్తామంటూ ప్రజలను మోసం చేస్తున్న ముగ్గురు వ్యక్తులను బాలానగర్ ఎస్‌ఓటీ, జీడిమెట్ల పోలీసులు రిమాండ్‌కు తరలించారు. షాపూర్ నగర్‌లోని బాలానగర్ డీసీపీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అదనపు డీసీపీ సత్యనారాయణ ఎస్‌ఓటీ అదనపు డీసీపీ శోభన్, ఇన్‌స్పెక్టర్ మల్లేష్‌తో కలిసి డీసీపీ సురేష్‌కుమార్ వివరాలు వెల్లడించారు. ఉప్పల్‌కు చెందిన యాశల కామేశ్వర్‌రావు అలియాస్ వొల్లకంటి రాజా, అలియాస్ మహేష్, గుంటూరు జిల్లాకు చెందిన వేముల పుల్లారావు, పల్నాడు జిల్లాకు చెందిన బత్తుల కోటేశ్వరరావు ముగ్గురు ఓ ముఠాగా ఏర్పడి విజయవాడలో 20 గ్రాముల నకిలీ బంగారు నాణేలను తయారు చేయించారు. తమవద్ద బంగారు నాణేలు ఉన్నాయని మార్కెట్ ధర కన్నా రూ.10 వేలు తక్కువకు ఇస్తామంటూ కామేశ్వరరావు తెలిసిన వారికి చెప్పుకున్నారు. ఈ విషయం వికారాబాద్ జిల్లా తాండూర్‌కు చెందిన అంజలికి తెలిసింది. ఆమె కోటేశ్వరరావు ఫోన్‌చేసి బేరం మాట్లాడుకున్నారు. బంగారం కావాలంటే నేవారిని షాపూర్‌నగర్‌లోని శుభం హోటల్‌కు రావాలని కోటేశ్వరరావు తెలిపాడు. దీంతో అంజలి తనకు తెలిసిన భానురేఖ, ప్రభావతి ఓ గోల్డ్‌స్మిత్‌తో కలిసి షాపూర్‌నగర్ రూ.28.5 లక్షలను తీసుకొచ్చారు. కొనుగోలు జరుగుతున్న సమయంలో ఓ వ్యక్తి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు నకిలీ బంగారు నాణేలు ఉన్నట్లు గుర్తించి ముగ్గురిని రిమాండ్ తరలించారు.

నేడు ఆది శంకరాచార్య హరికథా గానం

మియాపూర్: మియాపూర్ దీప్తిశ్రీనగర్‌లోని ధర్మపురి క్షేత్రంలో వ్యాసపూర్ణిమ సందర్భంగా జగద్గురు శంకరాచార్య హరికథా గానం ఆదివారం సాయంత్రం 5.30 గంటలకు నిర్వహించనున్నట్లు ధర్మపురి క్షేత్రం నిర్వాహకులు భారతీయం సత్యవాణి ఓ ప్రకటనలో తెలిపారు. నేమాని నాగలక్ష్మీ భగవతారిణిచే జగద్గురు శంకరాచార్య హరికథా గానం చేయనున్నట్లు తెలిపారు.

రాష్ట్ర కమిటీ సమావేశాలను జయప్రదం చేయండి

మియాపూర్: మియాపూర్, ముజఫర్ అహ్మద్‌నగర్‌లో ఈ నెల 23, 24వ తేదీలలో జరగనున్న ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కమిటీ సమావేశాలను విజయవంతం చేయాలని ఎంసీపీఐ (యూ) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వనం సుధాకర్ అన్నారు. శనివారం ముజఫర్ అహ్మద్‌నగర్‌లో నిర్వహించిన ఎంసీపీఐ(యూ) గ్రేటర్ హైదరాబాద్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ...ప్రస్తుత రాజకీయ పరిణామాలలో భవిష్యత్ కార్యక్రమాలను రూపొందించుకోవడానికి ఈ సమావేశాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సుధాకర్

నిమ్స్‌మేలో ఉచిత శిక్షణ

వెంగళరావునగర్: యూసుఫ్‌గూడలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫర్ మైక్రో స్మాల్ అండ్ మీడియం ఎంటర్ ప్రైజెస్ (నిమ్స్‌మే) కేంద్ర ప్రభుత్వ శిక్షణా సంస్థలో యువతకు వివిధ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు అసోసియేట్ ఫ్యాకల్టీ మెంబర్ వి. స్వప్న తెలిపారు. నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించేందుకు నిమ్స్‌మే ఈ ట్రెనింగ్ ఏర్పాటు చేసిందన్నారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ చదివి వయసు 18– 35 ఏళ్లలోపు ఉన్నవారు అర్హులని పేర్కొన్నారు. మేకప్ ఆర్టిస్ట్, క్రాఫ్ట్ బేకర్, గ్రాఫిక్ డిజైనర్, టైలర్, యానిమేషన్, జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్, క్లౌడ్ కంప్యూటింగ్ జూనియర్ అనలిస్ట్, ఏఐ అండ్ ఎంఎల్, జూనియర్ టెలికాం డేటా అనలిస్ట్, మెషిన్ లెర్నింగ్ ఇంజినీర్, అకౌంట్స్ ఎగ్జిక్యూటివ్, కంపోజిటర్, మీడియా డెవలపర్, అప్లికేషన్ డెవలపర్ (వెబ్/మొబైల్), వీఎఫ్‌ఎక్స్ ఎడిటర్ కోర్సుల్లో శిక్షణ ఉంటుందన్నారు. ఆసక్తి గల యువతీ యువకులు తమ ఆధార్‌కార్డు, మూడు పాస్‌పోర్ట్ ఫొటోలు, ఐడీ ప్రూఫ్, ధృవీకరణ పత్రాలను నిమ్స్‌మే క్యాంపస్‌లో ఇవ్వాలని సూచించారు. పూర్తి వివరాలకు 040–2363 3244/ 217/218 నంబర్లలో సంప్రదించవచ్చన్నారు.

గురు పౌర్ణమి వేడుకలు

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి వివేకానంద నగర్ కాలనీలోని సాయి మందిరం 27వ వార్షిక గురుపౌర్ణమి వేడుకలు శనివారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 5 గంటలకు కాగడ హారతి, పంచామృతాభిషేకం, మహా సుదర్శన హోమం, 10 గంటలకు సహస్ర కలశాభిషేకం, మధ్యాహ్నం అన్నదానం, సంధ్యాహారతి, మహా చండీహోమం, సేజ్ హారతి వంటి కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఆలయ ధర్మకర్త రాజేశ్వరరావు, యామిని దంపతులు పూజలు నిర్వహించారు.


అభిషేకం చేస్తున్న భక్తులు



కనువిందు.. నృత్యప్రదర్శన

మాదాపూర్: శిల్పారామంలో నిర్వహించే వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా శనివారం కందుల కూచిపూడి నాట్యాలయం గురువు రవి కూచిపూడి శిష్యబృందం నృత్యప్రదర్శనతో అలరించారు. గురు వందన, శ్లోకాలు, జతులు, మూషికవాహన, పుష్పాంజలి, బ్రహ్మాంజలి, శివస్తుతి, రామాయణశబ్దం, తిల్లాన తదితర అంశాలను ప్రదర్శించారు.అనంతరం 200 మంది కళాకారులతో గురువందనం చేశారు. కార్యక్రమంలో హిందూ సేవా సమితి రాధాకృష్ణ, నాట్యగురువు కోక విజయలక్ష్మీ, డాక్టర్ పేరిణీ రవితేజ, జానపద సంగీత గాయకులు విద్యారణ్యాచారి పాల్గొన్నారు.



రైతు బజార్‌లో కూరగాయల ధరలు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి రైతు బజార్‌లో కూరగాయల ధరలు(కిలో..రూ) కింది విధంగా ఉన్నాయి. టమాట 51, వంకాయ 23, బెండకాయ 28, పచ్చిమిర్చి 50, బజ్జిమిర్చి 40, కాకరకాయ 35, బీరకాయ 23, క్యాబేజి 26, బీన్స్ 45, క్యారెట్ 28, గోబిపువ్వు 28, దొండకాయ 23, చిక్కుడుకాయ 55, గోరుచిక్కుడు 28, బీట్‌రూట్ 23, క్యాప్సికం 50, ఆలుగడ్డ 38, కీర 18, దోసకాయ 18, సొరకాయ 15, పొట్లకాయ 9, కంద 50, ఉల్లిపొరక 45, ఉల్లిగడ్డ 39, మామిడికాయ 10 నుంచి 20, అరటికాయ 8 నుంచి 10, చామగడ్డ 35, ముల్లంగి 4 నుంచి 5, చిలగడ దుంప 40, గుమ్మడికాయ 40, మునగకాయ 10 నుంచి 12, బొప్పాయి 40, పుట్టగొడుగులు 40, ఎండుమిర్చి 220, అల్లం 200, వెల్లుల్లి 280, చింతపండు 140, పండుమిర్చి 80.

నేడు గురు పౌర్ణమి వేడుకలు

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ ఈస్ట్ సాయినగర్‌లోని సాయిబాబా మందిరంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు కపిల్‌రాజు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు లక్ష పుష్పార్చన, 12:30 గంటలకు హారతి, సాయంత్రం 6:30 గంటలకు పల్లకీ సేవ కార్యక్రమాలు ఆలయ ప్రధాన అర్చకులు వై.పవన్ స్వామి ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

కాంగ్రెస్‌లో వర్గ పోరు

గాంధీ ప్రసంగానికి అడ్డు తగిలిన కార్యకర్తలు

గచ్చిబౌలి: సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలోనే శేరిలింగంపల్లి కాంగ్రెస్‌పార్టీలో వర్గ పోరు బయటపడింది. శనివారం గోపన్‌పల్లిలో సీఎం రేవంత్‌రెడ్డి ఫ్లైఓవర్ ప్రారంభించారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలోఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతుండగా స్టేజీ ఎదురుగా ఉన్న కొందరు కార్యకర్తలు జై జగదీశ్వర్‌గౌడ్ అంటూ నినాదాలు చేసి ప్రసంగానికి అడ్డుతగిలారు. గత అసెంబ్లీ ఎన్నికలలో జగదీశ్వర్‌గౌడ్ కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో నిలిచి గాంధీ చేతిలో ఓటమీ పాలయ్యారు. కాగా గాంధీ కాంగ్రెస్ పార్టీలోకి రావడం జగదీశ్వర్‌గౌడ్ వర్గానికి ఇష్టం లేదు. పైగా జగదీశ్వర్‌గౌడ్‌ను ఆలస్యంగా స్టేజి పైకి పిలవడంతో నినాదాలు చేసినట్లుగా తెలుస్తోంది. ఎమ్మెల్యే మాట్లాడుతుండగా నినాదాలు చేయడంతో పోలీసులు జోక్యం చేసుకొని సర్ది చెప్పారు. స్టేజీ మీద ఉన్న జగదీశ్వర్ గౌడ్ నినాదాలు వద్దని వారించినా అనుచరులు హడావిడి చేశారు. సీఎం మాత్రం అన్ని గమనిస్తూ ఉండిపోయారు.

సొంతింటి కలను నెరవేర్చిన ఘనత కేసీఆర్‌దే



సనత్‌నగర్: పేద ప్రజల సొంత ఇంటి కల నెరవేర్చిన ఘనత గత బీఆర్‌ఎస్ ప్రభుత్వానిదేనని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. హమాలీబస్తీకి చెందిన రేణుక తనకు దుండిగల్‌లో డబుల్ బెడ్‌రూమ్ ఇల్లును కేటాయిస్తూ అధికారులు సర్టిఫికెట్ అందజేయగా, శనివారం తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను వెస్ట్‌మారేడ్‌పల్లిలోని నివాసం కలిసి తన ఆనందాన్ని వ్యక్తంచేసింది. ముఖ్యమంత్రిగా కేసీఆర్ అన్ని సౌకర్యాలతో కూడిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను నిర్మించి పేదలకు ఉచితంగా ఇచ్చిన విషయాన్ని ఎమ్మెల్యే గుర్తుచేశారు.

ట్రిపుల్‌ఐటీ బస్టాప్‌లో మొబైల్ బస్‌పాస్ కౌంటర్

రాయదుర్గం: ఐటీ ఉద్యోగులు, బస్ ప్రయాణికుల సౌకర్యార్థం గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో మొబైల్ బస్‌పాస్ కౌంటర్‌ను అందుబాటులోకి తెచ్చారు. ట్రిపుల్‌ఐటీ కూడలిలో ప్రతిరోజూ ఉదయం 10 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు అందుబాటులో ఉంటుంది. ఆదివారం సెలవు.

22 నుంచి న్యాక్ శిక్షణా తరగతులు ప్రారంభం

మాదాపూర్: మాదాపూర్‌లోని నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ ఆధ్వర్యంలో ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్లకు ఈ నెల 22 నుంచి శిక్షణా తరగతులు ప్రారంభమవుతాయని నిర్వాహకులు తెలిపారు. జనరల్ కేటగిరి బీఈ, బీటెక్ సివిల్ ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్ల కోసం 3 నెలల ప్లేస్‌మెంట్ లింక్డ్ పేమెంట్ ఫినిషింగ్ స్కూల్ ప్రోగ్రామ్‌ను, ఎస్సీ, బీసీ, సీ వర్గానికి చెందిన బీఈ, బిటెక్ సివిల్ ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్ల కోసం 3నెలల ప్లేస్‌మెంట్ లింక్డ్ పేమెంట్ ఫినిషింగ్ స్కూల్ ప్రోగ్రాంను ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ, భోజన వసతి, 100శాతం ప్లేస్‌మెంట్‌ను కల్పించనున్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఫోన్ 9505631765లలో సంప్రదించ వచ్చు.